సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025



ఉప్పొంగిన వాగులు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని పలు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండగా బ్రిడ్జిలు నీటమునిగాయి. 10లో



'సాదాబైనామా'పైనే ఆశలు

భూముల క్రయవిక్రయాల ఒప్పందాలు తెల్ల కాగితాల్లో రాసుకున్న రైతులు పట్టాల కోసం ఏళ్లతరబడి ఎదురుచూస్తున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
29°/ 24°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయి.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ప్రజావాణికి స్వల్పంగా హాజరు



దరఖాస్తులు స్వీకరిస్తున్న డీఏఓ

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి స్వల్ప సంఖ్యలో ప్రజలు హాజరై సమస్యల పరిష్కారానికి వినతులు అందజేశారు. భారీ వర్షాలకు తోడు ప్రజావాణి కార్యక్రమాన్ని కొత్తగూడెం రెవెన్యూ డివిజన్ స్థాయిలో తొలిసారిగా నిర్వహించే విషయంలో సరైన సమాచారం లేక తక్కువ సంఖ్యలో వచ్చారు. అనారోగ్యం కారణండా ఆర్డీఓ మధు సెలవులో ఉండగా, డీఏఓ శకుంతల ఫిర్యాదులు స్వీకరించారు.

పెరిగిన పామాయిల్ గెలల ధర

అశ్వారావుపేటరూరల్: పామాయిల్ గెలల టన్ను ధర మరోసారి పెరిగింది. సోమవారం హైదరాబాద్‌లోని ఆయిల్‌ఫెడ్ ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులు నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం వరకు టన్ను ధర రూ.18,052 ఉండగా, తాజాగా రూ.1,055 పెంచి రూ.19,107గా నిర్ణయించారు. ఈ మేరకు అధికారికంగా జీఓ విడుదల చేయడంతో పామాయిల్ సాగుదారుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.


పట్టాలు లేవంటూ పత్తి పంట ధ్వంసం



పత్తి మొక్కలను తొలగిస్తున్న అటవీ సిబ్బంది

పాల్వంచరూరల్ : ఇప్పుడిప్పుడే ఏపుగా ఎదుగుతున్న పత్తి పంటను వైల్డ్‌లైఫ్ అధికారులు ధ్వంసం చేయగా బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని ఉలవ్వనూరు బంజర, చిరుతానిపాడు, మందెరలకపాడు గ్రామాల్లో ఆదివాసీ రైతులు పూనెం రమేష్, ఎర్రబోయిన చిట్టిబాబు, కాలం ఎర్రయ్య, సురేష్ పత్తి సాగు చేస్తుండగా.. ఆ భూములకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు లేవంటూ అటవీ అధికారులు మొక్కలను తొలగించారు. కాగా, తాము అధికారులను బతిమిలాడినా వినకుండా ధ్వంసం చేశారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భారీగా పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలను ధ్వంసం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకుడు నిమ్మల రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. పోడు సాగుదారులపై అటవీ అధికారుల దాడులు ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు చాతకొండ రేంజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వేములపల్లి శ్రీనివాసరావు, సంజీవరావు, రామారావు, మడకం కృష్ణ, పద్దం దేవయ్య, పదం భీమా, తాటిలక్ష్మయ్య, మడకం ప్రసాద్ పాల్గొన్నారు.

కిన్నెరసాని మూడు గేట్లు ఎత్తివేత



కిన్నెరసాని నుంచి విడుదలవుతున్న వరదనీరు

పాల్వంచరూరల్ : ఎగువన కురుస్తున్న వర్షాలతో కిన్నెరసాని జలాశయానికి వరద ఉధృతి పెరిగింది. 407 అడుగుల నీటినిల్వ సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 10,600 క్యూసెక్కుల వరద రావడంతో సోమవారం నీటిమట్టం 405.80 అడుగులకు పెరిగింది. దీంతో మూడు గేట్లు ఎత్తి 15వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు ఏఈ తెలిపారు.

రేపు జిల్లాకు రానున్న సీఎం రేవంత్‌రెడ్డి

- ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకలకు హాజరు
- చంద్రుగొండ మండలం దామరచర్లలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు
- రాజుకోనున్న స్థానిక ఎన్నికల వేడి

చంద్రుగొండ మండలం దామరచర్లలో సీఎం బహిరంగ సభ కోసం చేస్తున్న ఏర్పాట్లు



ఇక్కడి నుంచే సమరశంఖం !

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం కార్యక్రమం వేదికగా అధికార కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల సమర శంఖాన్ని జిల్లా నుంచే పూరించనుందా అంటే అవుననే సమాధానం హస్తం వర్గాల నుంచి వస్తోంది. చంద్రుగొండ సభ ఏర్పాట్లు సైతం అలాగే ఉంటున్నాయి.

పార్లమెంట్‌కూ ఇక్కడి నుంచే..

తెలంగాణ అసెంబ్లీకి 2023 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత 2024లో పార్లమెంట్ ఎన్నికలు జరగగా.. అంతకుముందే 2024 మార్చి 11న భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. తమ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల వివరాలను ఈ సభలో వెల్లడించారు. అదే రోజు సాయంత్రం మణుగూరులో ప్రజాదీవెన పేరుతో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు హాజరై మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోరిక బలరాం నాయక్‌కు పరిచయం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి నోటిఫికేషన్ వెలువడకముందే కాంగ్రెస్ తరఫున తొలి ఎన్నికల ప్రచారం జిల్లాలో ప్రారంభించారు. ఆ తర్వాత కొత్తగూడెం సభకు కూడా సీఎం వచ్చారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని రెండు స్థానాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థులుగా బలరాంనాయక్, రామసహాయం రఘురామిరెడ్డి విజయం సాధించారు.

ఈసారీ అంతేనా..?

స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ప్రభుత్వం లేఖ రాసింది. మరోవైపు ఓటర్ల జాబితా ప్రకటన, పోలింగ్ కేంద్రాల గుర్తింపు వంటి పనులు చకచకా సాగుతున్నాయి. పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధమనే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తరుణంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం కార్యక్రమం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారాన్ని అనధికారికంగా కాంగ్రెస్ ప్రారంభించబోతోందనే అభిప్రాయాన్ని రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల బహిరంగ సభ తరహాలోనే ఆత్మీయ సభ ఏర్పాట్లు జరుగుతుండడం ఈ విశ్లేషణలకు బలం చేకూరుస్తోంది. లక్ష మంది హాజరయ్యేలా అత్యంత భారీగా సభ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సభకు ఇల్లెందు, కొత్తగూడెం, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట, వైరా, సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఇందిరమ్మ లబ్ధిదారులతో పాటు భారీగా జన సమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఎక్కడా లేని విధంగా ఈ సభలో ప్రజల మధ్యకు వచ్చి సీఎం అభివాదం చేసేలా 48 అడుగుల పొడవుతో వాకింగ్ ర్యాంప్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. సభకు వచ్చిన ప్రతీ ఒక్కరికి సీఎం స్పష్టంగా కనిపించేలా భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల మీద ఉండే మూడు రంగులు ప్రస్ఫుటంగా కనిపించేలా సభా ప్రాంగణాన్ని తీర్చి దిద్దుతున్నారు. ఓవైపు ఏర్పాట్లు ఘనంగా సాగుతుంటే మరోవైపు కారుమబ్బులు కాంగ్రెస్ నాయకుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి.

సీఎం పర్యటన నేపథ్యాన ఆంక్షలు

కొత్తగూడెంటౌన్: సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 3న చంద్రుగొండ మండలంలో పర్యటించనున్న నేపథ్యాన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టనున్నట్లు కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. వీఎం బంజర్ నుంచి చంద్రుగొండ మీదుగా కొత్తగూడెం వచ్చే వాహనాలు కల్లూరు, తల్లాడ, ఏన్కూరు, జూలూరుపాడు మీదుగా చేరుకోవాలని సూచించారు. అలాగే, కొత్తగూడెం నుంచి వీఎం బంజర వైపు వెళ్లే వారు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలని కోరారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

చంద్రుగొండ : సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్ సోమవారం పరిశీలించారు. బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సీఎం సమావేశమయ్యే ప్రదేశాన్ని, నిర్మాణం పూర్తయిన ఇళ్లను సందర్శించారు. పారిశుద్ధ్య పనులు పూర్తి చేయాలని, చంద్రుగొండ - బెండాలపాడు రహదారిపై ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం చంద్రుగొండలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌ను, దామరచర్లలో సభాస్థలిని తనిఖీ చేశారు. కాగా, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కూడా సాయంత్రం పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్ బృందం కూడా హెలీప్యాడ్‌ను తనిఖీ చేసింది. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ బయ్యారపు అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సభాస్థలిని పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు

సహజవనంలో సాంకేతిక సొబగులు

- రోప్‌వే ఏర్పాటుకు కలెక్టర్ ఆదేశం
- అవకాశాలను పరిశీలించిన అధికారులు

ఇల్లెందురూరల్: సహజత్వం ఉట్టిపడేలా రూపుదిద్దుకున్న అటవీ శాఖ నేచర్ పార్క్‌లో సౌకర్యాల పెంపుపై కలెక్టర్ జితేష్ వి పాటిల్ దృష్టి సారించారు. పార్క్‌లో రంగురంగుల పూలు, సుగంధ పరిమళాలతో అహ్లాదం, పచ్చదనం, ఓపెన్ జిమ్ వంటి సౌకర్యాలు కల్పించి ఎక్కువ మంది సందర్శించేలా ప్రణాళిక రూపొందించారు. పర్వతాలు, లోయల వంటి ప్రాంతాలున్న చోట ఏర్పాటు చేసే రోప్‌వేను నేచర్ పార్క్‌లో సాంకేతిక సొబగులతో అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. ఈ మేరకు డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి, మైన్స్ ఏడీ దినేష్ స్థానిక అధికారులతో కలిసి సోమవారం పార్కును సందర్శించారు. వాచ్‌టవర్‌ను పరిశీలించారు. పార్క్ మధ్యలో ఉన్న గుట్టను ఆధారంగా చేసుకొని జిప్‌లైన్ రోలర్ కోర్టర్‌ను వంద మీటర్ల దూరం వరకు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. జిప్‌లైన్ రోలర్ అనేది గురుత్వాకర్షణ శక్తిని ఉపయోగించుకుంటూ ఒక కేబుల్‌పై అమర్చిన పుల్లీ ద్వారా ప్రయాణించే సస్పెన్షన్ రైడ్ అని చెప్పారు. సుమారు కిలోమీటరు పొడవుతో 15 నుంచి 50 అడుగుల ఎత్తులో చెట్ల మధ్య రోప్‌వే ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించామని చెప్పారు. దీనికి సంబంధించిన సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. వారి వెంట తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, ఎఫ్‌ఆర్‌ఓ చలపతిరావు ఉన్నారు.



రోప్‌వే ఏర్పాటు ప్రతిపాదిత మార్గాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జిల్లాలో అధిక వర్షపాతం

- సోమవారం జిల్లా సరాసరి 79.8 మి.మీ.గా నమోదు
- అత్యధికంగా కొత్తగూడెంలో 192.4 మి.మీ.

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో వర్షపాతం నమోదు సాధారణ స్థాయి నుంచి అధికానికి చేరింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షంతో ఒక్కసారిగా గణాంకాలు మారిపోయాయి. జిల్లా వ్యాప్తంగా సోమవారం 1,834.6 మి.మీ. వర్షం కురవగా జిల్లా సరాసరి 79.8 మి.మీ.గా నమోదైంది. కొత్తగూడెంలో అత్యధికంగా 192.4 మి.మీ. వర్షం కురవడం విశేషం. ఇక కరకగూడెం మండలంలో 59.8 మి.మీ, పినపాకలో 36.4, చర్లలో 96.2, దుమ్ముగూడెంలో 20.2, అశ్వాపురంలో 46.2, మణుగూరులో 33.2, ఆళ్లపల్లిలో 17, గుండాలలో 22.2, ఇల్లెందులో 150.6, టేకులపల్లిలో 69.2, జూలూరుపాడులో 69.6, చంద్రుగొండలో 70, అన్నపురెడ్డిపల్లిలో 105.8, చుంచుపల్లిలో 176.6, సుజాతనగర్‌లో 82.2, లక్ష్మీదేవిపల్లిలో 133.6, పాల్వంచలో 119.6, బూర్గంపాడులో 18.6, ములకలపల్లిలో 88.2, దమ్మపేటలో 107.6, అశ్వారావుపేట మండలంలో 114.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. భద్రాచలంలో అత్యల్పంగా 4.8 మి.మీ.వర్షం పడింది.

ఈ మండలాల్లో అధికం..

ఇప్పటి వరకు జిల్లాలో 14 మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. వాటిలో అశ్వాపురం, మణుగూరు, ఇల్లెందు, టేకులపల్లి, జూలూరుపాడు, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ, బూర్గంపాడు, అశ్వారావుపేట మండలాలు ఉండగా, కరకగూడెం, పినపాక, చర్ల, దుమ్ముగూడెం, ఆళ్లపల్లి, గుండాల, భద్రాచలం, ములకలపల్లి, దమ్మపేట మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 1 వరకు జిల్లా వ్యాప్తంగా సాధారణం కంటే 23.2 శాతం అధిక వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు.



ములకలపల్లి మండలం సత్యంపేట శివారులోని మినీ బ్రిడ్జిపై వరద ఉధృతి ఇలా..

గోదావరి తగ్గుముఖం



భద్రాచలం వద్ద గోదావరి వరద ప్రవాహం

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టి సోమవారం రాత్రి 42 అడుగులకు చేరుకుంది. దీంతో అధికారులు 24 గంటల్లో మొదటి, రెండో ప్రమాద హెచ్చరికలను ఉపసంహరించారు. ఎగువ నుంచి వదర నీరు భారీగా రావడంతో గత రెండు రోజులుగా పెరుగుతూ.. తగ్గుతూ దాగుడుమూతలాడిన గోదావరి నీటి ప్రవాహం ఇటు ఏజెన్సీవాసులతో పాటు అధికారులను కంగారు పెట్టించింది. ఆదివారం ఉదయం వరకు నిలకడగా ఉన్న నీటి ప్రవాహం చిన్నగా పెరుగుతూ 9 గంటలకు 48 అడుగులకు చేరుకుంది. దీంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అ తర్వాత నాలుగు గంటల పాటు నిలకడగా ఉండి నెమ్మదిగా తగ్గుముఖం పట్టింది. అలా సోమవారం రాత్రి 7.37 గంటలకు 42.90 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరికను కూడా ఉపసంహరించారు. దీంతో మూడు రోజులుగా భద్రాచలం - చర్ల మధ్యతో పాటు ఏజెన్సీలోని పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు మళ్లీ ప్రారంభమయ్యాయి.

ఈఅండ్‌ఎం డైరెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ



తిరుమలరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కనకయ్య

సింగరేణి(కొత్తగూడెం)/ఇల్లెందు: సింగరేణి సంస్థ ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్(ఈఅండ్‌ఎం) డైరెక్టర్‌గా మోకాళ్ల తిరుమలరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం హైదరాబాద్‌లో సీఎండీ ఎన్.బలరామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సంస్థలో ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదలలో ఈ అండ్‌ఎం శాఖ కీలకమైనందున సోలార్, థర్మల్ ప్రాజెక్ట్ విస్తరణలో ముఖ్యపాత్ర పోషించాలని సూచించారు. కాగా, డైరెక్టర్ తిరుమలరావుకు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య శుభాకాంక్షలు తెలిపారు. ఇల్లెందు మండలం కట్టుగూడెంకు చెందిన తిరుమలరావు సింగరేణిలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వర్తిస్తూ డైరెక్టర్‌గా ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. 139 ఏళ్ల సింగరేణి చరిత్రలో తొలిసారి ఆదివాసీ అధికారికి డైరెక్టర్ పదవి లభించిందని ఎమ్మెల్యే చెప్పారు. ఆయన వెంట కాంట్రాక్టర్ రాము తదితరులు ఉన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలని ధర్నా

టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో భారీ మోటారు సైకిల్ ర్యాలీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ టీపీఈజేఏసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అంతకుముందు పాలవ్వంచ బస్టాండ్ సెంటర్ నుంచి ఐడీఓసీ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ అమరనేని రామారావు, సెక్రటరీ జనరల్ సంగెం వెంకటపుల్లయ్య మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తామని అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఆ వాగ్దానాన్ని అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల, ప్రభుత్వ నిధులను షేర్‌మార్కెట్‌కు తరలిస్తూ నష్టం కలిగిస్తున్నారని విమర్శించారు. ఇతర కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల మాదిరిగా తెలంగాణలోనూ సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో టీజీఈజేఏసీ భాగస్వామ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న అమరనేని రామారావు

స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపాలి

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజన నిరుద్యోగ యువత, మహిళలు స్వయం ఉపాధి పథకాల వైపు మొగ్గు చూపాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌కు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి సంబంధిత అధికారులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. అర్హులైన గిరిజనులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల్లో కొన్ని ఇలా..

అశ్వారావుపేట మండలం కేశప్పగూడెం గ్రామస్తులు సోలార్ ద్వారా కరెంట్ లైన్ ఇప్పించాలని, చంద్రుగొండ మండలం తిప్పనపల్లికి చెందిన కృష్ణవేణి ఫ్లోర్ మిల్‌కు రుణం మంజూరు చేయాలని, కరకగూడెం మండలానికి చెందిన అరుణ జీవనోపాధికి, మణుగూరు మండలానికి చెందిన బాబురావు చేనేత మగ్గాలు ఇప్పించాలని, బూర్గంపాడు మండలం శ్రీరాంపూర్ గ్రామస్తులు అంగన్‌వాడీ, జీపీఎస్ పాఠశాల ఏర్పాటు చేయాలని వినతులు అందించారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో చేతికొస్తున్న పత్తి చేలను ధ్వంసం చేసిన అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలని న్యూడెమోక్రసీ నాయకులు కోరారు. దర్బార్‌లో ఏపీఓ డేవిడ్‌రాజ్, గురుకులాల ఆర్‌సీఓ అరుణకుమారి, గిరిజన సంక్షేమ ఈఈ హరీష్, అధికారులు సైదులు, సున్నం రాంబాబు, భాస్కర్, ఉదయ్‌కుమార్, ఆర్.లక్ష్మీనారాయణ, ఆదినారాయణ పాల్గొన్నారు. కాగా, భద్రాచలం సబ్ కలెక్టరేట్‌లో తొలిసారి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి గిరిజనులు భారీగా తరలివచ్చి సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. వాటిని సత్వరమే పరిష్కరించి న్యాయం జరిగేలా చూస్తామని సబ్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ వారికి హామీ ఇచ్చారు.



దమ్మపేట : అభ్యసన సామగ్రిని పరిశీలిస్తున్న పీఓ

సులభంగా అర్థమవుతుంది..

దమ్మపేట : విద్యా బోధనలో అభ్యసన సామగ్రి(టీఎల్‌ఎం)ని ఉపయోగిస్తే విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమవుతాయని పీఓ రాహుల్ అన్నారు. మండలంలోని పార్కలగండి బాలుర ఆశ్రమ పాఠశాలలో సోమవారం టీఎల్‌ఎం మేళా ఏర్పాటుచేయగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై టీఎల్‌ఎం మెటీరియల్‌ను పరిశీలించి, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. టీఎల్‌ఎం ద్వారా ఉపాధ్యాయుల్లో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభ బయటకు వస్తుందని అన్నారు. ఈ నెల 9న భద్రాచలం ఐటీడీఏ పరిధిలో టీఎల్‌ఎం మేళా నిర్వహించి, ఉత్తమ ఉపకరణాలను ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఏసీఎంఓ రమేష్, ఏటీడీఓ చంద్రమోహన్, ఎంఈఓ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గణపతికి 'మహా' నైవేద్యం !

పాల్వంచ వర్తక సంఘం ఆధ్వర్యంలో వినాయకుడికి సోమవారం 108 రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరు కాగా వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. -పాల్వంచ



తాలిపేరుకు పెరుగుతున్న వరద

చర్ల: తాలిపేరు ప్రాజెక్టుకు వరద ఉధృతి మళ్లీ పెరుగుతోంది. దీంతో సోమవారం ఉదయం 7 గంటలకు 5 గేట్లు ఎత్తి 9,477 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. గంటగంటకూ ప్రవాహం పెరుగుతుండడంతో సాయంత్రం 6 గంటలకు 16 గేట్లు ఎత్తి 30,148 క్యూసెక్కుల చొప్పున వరదనీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో మరింతగా వరద వచ్చే ప్రమాదం ఉండడంతో సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రాజెక్టు డీఈ తిరుపతి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.



తాలిపేరు నుంచి విడుదలవుతున్న వరదనీరు


టేకులపల్లి: రోడ్డుపై ప్రవహిస్తున్న సాయమ్మ చెరువు అలుగు


దమ్మపేట: ఉధృతంగా ప్రవహిస్తున్న పేరంటాల చెరువు అలుగు


సూపర్‌బజార్‌(కొత్తగూడెం): రామవరంలో నేల కూలిన వృక్షం

ఉప్పొంగిన వాగులు


కొత్తగూడెం అర్బన్‌: ముర్రేడులో చిక్కుకున్న ట్రాక్టర్‌


గుండాల : లో లెవల్‌ వంతెనపై కిన్నెరసాని ఉధృతి


అశ్వారావుపేటరూరల్‌: పామాయిల్‌ తోటను ముంచెత్తిన వరదనీరు


చుంచుపల్లి: విద్యానగర్‌ ప్రధాన రహదారిపై వరద


ములకలపల్లి: మాధారం ఎర్రచెరువుకట్టకు గండి..


మణుగూరురూరల్‌: ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు


కొత్తగూడెంఅర్బన్‌ : వ్యవసాయ మార్కెట్‌ యార్డులోకి చేరిన వర్షపు నీరు


జూలూరుపాడు: మాచినేనిపేట-వాగొడ్డుతండా మధ్య ఎదళ్లవాగు ప్రవాహం

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బ్రిడ్జిలు నీటమునిగాయి. చెరువులు, కుంటలు అలుగుపోస్తున్నాయి. పల్లెలు, బస్తీల్లో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. పంటచేలు నీటమునిగాయి. చెట్లు నేలకూలాయి. చప్టాలు, రోడ్లు దెబ్బ తిన్నాయి. ప్రహారీలు కూలిపోయాయి. గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని గ్రామాలు జలదిగ్బంధంలో ఉండిపోయాయి. మండల కేంద్రం, ఇతర ప్రధాన గ్రామాలతో సంబంధాలు తెగిపోయియి. మూకమామిడి ప్రాజెక్ట్‌ అలుగు పోస్తోంది. పలుచోట్ల రహదారులపైకి వరద నీరు చేరింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. చింతల చెరువు ఉప్పొంగి జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌ ప్రధాన రహదారిపై మోకాలి లోతు నీరు చేరింది. వర్షపునీరు చేరి కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్‌ యార్డు చెరువును తలపించింది. కొత్తగూడెం కార్పొరేషన్‌ పరిధిలో పలుచోట్ల జనావాసాల్లోకి వరద నీరు చేరింది. హేమచంద్రపురం పంచాయతీ ట్రాక్టర్‌ వరద నీటిలో మునిగింది. పోలీసు, రెవెన్యూ అధికారులు వాగులను సందర్శించి ప్రజలను అప్రమత్తం చేశారు. రోడ్లపై వరద ఉధృతి ఉన్నచోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు రాకపోకలను నియంత్రించారు. –సాక్షి నెట్‌వర్క్‌


కరకగూడెం: ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు


దమ్మపేట: మొద్దులగూడెంలో రోడ్డుపైనే చేపల వేట


ఇల్లెందు : నెంబర్‌-2 బస్తీలో పొంగిన బుగ్గవాగు


దమ్మపేటలో ప్రధాన రహదారిపై పోటెత్తిన వరద


ఇల్లెందురూరల్‌ : ఇల్లెందు-మహబూబాబాద్‌ ప్రధాన రహదారిపై..


అశ్వారావుపేటరూరల్‌: పెదవాగు నుంచి వదులుతున్న వరదనీరు


ములకలపల్లి: అలుగు పోస్తున్న మూకమామిడి ప్రాజెక్ట్‌

‘సాదాబైనామా’పైనే ఆశలు

- ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న సాగుదారులు
- జిల్లాలో 62,511 మంది రైతుల దరఖాస్తులు

పాల్వంచరూరల్‌: క్రయవిక్రయాల ఒప్పందాలు తెల్లకాగితాల్లో రాసుకున్న రైతులు పట్టాల కోసం ఏళ్లతరబడి ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో సాదాబైనామాల క్రమబద్ధీకరణకు ఇటీవల హైకోర్టు అనుమతులు ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో సాదాబైనామాలపై దరఖాస్తులు స్వీకరించినా సమస్యను పరిష్కరించలేదు. భూములు సాగు చేసుకుంటున్నా ధరణి పోర్టల్‌ కారణంగా భూ యాజమాన్య హక్కు (పట్టా)లు రాలేదు. ఇందుకోసం ప్రస్తుత ప్రభుత్వం తీసుకురానున్న ఆర్‌ఓఆర్‌ బిల్లుపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు.

పొజిషన్‌లో ఉన్నా..

భూముల క్రయవిక్రయాలు సాదా కాగితాలు, స్టాంప్‌ పేపర్లపైనా జరిగాయి. దశాబ్దాల నుంచి, తరతరాలుగా భూమిని సాగు చేసుకుంటున్నా, పొజిషన్‌లో ఉన్నా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు రాలేదు. దీనికితోడు ఓ రైతు భూమి సర్వే నంబర్‌ మరో రైతు పట్టా పాసుపుస్తకంలో నమోదు కావడం, భూమిని విక్రయించినవారు చనిపోవడం, పూర్వీకులు విక్రయంచిన భూమినే వారి వారసులు మళ్లీ మరొకరికి విక్రయించడం వంటి సమస్యలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో భూ యజమాన్య హక్కు(రిజిస్ట్రేషన్‌)లు నమోదు కాలేదు. దీంతో బ్యాంకర్లు రుణాలు ఇవ్వడంలేదు. రైతుభరోసాతో ఇతర సంక్షేమ పథకాలు కూడా అందడంలేదు. ఈ క్రమంలో గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్‌ స్థానంలో ప్రస్తుత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన భూభారతి (ఆర్‌ఓఆర్‌-2024) చట్టం ద్వారా సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

2016 నుంచి 2020 వరకు స్వీకరణ

2014 జూన్‌ 2వ తేదీకి ముందు సాదాకాగితాలపై క్రయ విక్రయాలు జరుపుకున్న భూములను క్రమబద్ధీకరిస్తామని గత ప్రభుత్వం 2016లో దరఖాస్తులు స్వీకరించింది. 2020లో మరో విడుత దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది. ఆ తర్వాత పట్టించుకోలేదు. జిల్లాలో మంది 62,511 సాదాబైనామా పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. మరోవైపు ఏజెన్సీలో 1/70 యాక్ట్‌ ఉన్నా గిరిజన రైతులకుపట్టాలు లేవు. కేవలం గిరిజనుల మధ్యే క్రయవిక్రయాలు జరిగినా పట్టాలు లేవు. వారుకూడా భూ హక్కు పత్రాల కోసం నిరీక్షిస్తున్నారు.

మార్గదర్శకాలు రాలేదు



సాదాబైనామాల క్రమబద్ధీకరణకు కోర్టు అనుమతులు ఇచ్చినా ప్రభుత్వం నుంచి ఇంకా మార్గదర్శకాలు రాలేదు. గైడ్‌లైన్స్‌ వచ్చిన వెంటనే సాదాబైనామాల దరఖాస్తుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. 2014 కంటే ముందు క్రయవిక్రయాలు జరిగిన భూములపై నెలకొన్న సమస్యలకే పరిష్కారం లభిస్తుంది.
–వేణుగోపాల్‌రావు, జిల్లా అదనపు కలెక్టర్‌

బ్యాంకు రుణాలు రావట్లే..



నాకు సోములగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఐదెకరాల భూమి ఉంది. గతంలో ఆన్‌లైన్‌ పహాణీలు కూడా ఉన్నాయి. గత ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేస్తామంటే సాదాబైనామా కింద దరఖాస్తు చేసుకున్నా. నేటికీ పట్టాపాసుపుస్తకాలు ఇవ్వలేదు. దీంతో బ్యాంక్‌ రుణాలు రావడంలేదు. ప్రభుత్వ సబ్సిడీలు అందడంలేదు.
–బండ్లపల్లి వెంకటనారాయణ, జగన్నాథపురం

క్రమబద్ధీకరణ అనుమతి హర్షణీయం



సాదాబైనామాల సమస్య పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాం. కోర్టు క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించడం హర్షణీయం. గిరిజనుల నుంచి గిరిజనులు భూములను కొనుగోలు చేసినా పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడంలేదు. సాదాబైనామా కింద 2014లో దరఖాస్తు చేసుకున్నా. ఇంత వరకు సమస్య పరిష్కారం కాలేదు.
–కొర్ర రాములు, సోములగూడెం

మండలాల వారీగా సాదాబైనామా దరఖాస్తుల వివరాలు..

అశ్వారావుపేట	1,850	పాల్వంచ	7,062
ములకలపల్లి	2,172	కరకగూడెం	527
దమ్మపేట	2,589	పినపాక	1,452
అన్నపురెడ్డిపల్లి	4,054	అశ్వాపురం	2,366
చండ్రుగొండ	4,978	బూర్గంపాడు	4,604
భద్రాచలం	78	మణుగూరు	2439
చర్ల	84,	ఆళ్లపల్లి	895
దుమ్ముగూడెం	362	గుండాల	980
కొత్తగూడెం	154	జూలూరుపాడు	3,752
చుంచుపల్లి	1,170	ఇల్లెందు	5,748
లక్ష్మీదేవిపల్లి	3,026	టేకులపల్లి	8,581
సుజాతనగర్‌	3,588		

గోదావరిలో వినాయక నిమజ్జనం

భద్రాచలంఅర్బన్‌: భద్రాచలం వద్ద గోదావరిలో వినాయక నిమజ్జన కార్యక్రమాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. సోమవారం 167 గణేష్‌ విగ్రహాలను నిమజ్జనం చేశారు. గణనాథుడికి ఐదు రోజులపాటు ప్రత్యేక పూజలు చేసిన భక్తులు మేళ తాళాలు, డప్పుచప్పులతో బాణసంచా కాల్చుతూ, ఊరేగింపుగా గోదావరి తీరంలో ఘాట్‌కు తరలించి నిమజ్జనం చేశారు. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు భక్తులను తీరం వరకు అనుమతించలేదు. స్నానఘట్టాల వద్ద స్నానాలు చేసేందుకు షవర్‌ ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్ల ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లాంచీలు, బోట్లలో వినాయక ప్రతిమలను తీసుకెళ్లి గోదావరి మధ్యలో గణనాథులను వదులుతున్నారు. ఘాట్‌ వద్ద విద్యుత్‌ సౌకర్యంతోపాటు నిత్యం పోలీసుల నిఘా ఉండేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. కాగా నిమజ్జనం సందర్భంగా కొందరు సిబ్బంది భక్తుల నుంచి నగదు వసూళ్లు చేస్తుండటంతో శనివారం అర్ధరాత్రి గొడవ జరిగింది.


వినాయక ప్రతిమను క్రేన్‌తో దించుతున్న సిబ్బంది

క్లుప్తంగా

జీసీసీని ప్రగతిపథంలో నడిపించాలి


మాట్లాడుతున్న సమ్మయ్య

పాల్వంచరూరల్‌: అందరి సహకారంతో జీసీసీని ప్రగతిపథంలో నడిపించాలని డివిజనల్‌ అధికారి సమ్మయ్య అన్నారు. సంస్థ పాల్వంచ బ్రాంచ్‌ మేనేజర్‌గా వి.లక్ష్మణ్‌ సోమవారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన బీఎం లక్ష్మణ్‌కు అందరూ సహకరించాలని, ఐక్యంగా పనిచేసి సంస్థను అభివృద్ధి బాటలోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో భద్రాచలం బీఎం జయరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెదవి, అంగిలి చీలిక ప్రత్యేక నిర్ధారణ శిబిరం

కొత్తగూడెంఅర్బన్‌: పెదవి, అంగిలి చీలికతో బాధపడుతున్న బాలబాలికలకు హైదరాబాద్‌లోని హబ్సిగూడ ఉన్న ఏవీఆర్‌ ఆస్పత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్స అందించనున్నట్లు జిల్లా సమ్మిళిత విద్యా కోఆర్డినేటర్‌ ఎస్‌కే.సైదులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్య నిర్ధారణకు మంగళవారం పాతకొత్తగూడెంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖ వైద్య నిపుణుడు ఎ.విజయ్‌కుమార్‌ శిబిరానికి హాజరవుతారని, బాధితులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

ఆర్థికంగా ఎదగాలి

కొత్తగూడెంఅర్బన్‌: మెప్మా గ్రూప్‌ సభ్యులు ఆర్థికంగా ఎదగాలని, అందుకోసం రుణాలతో వ్యాపారాలు చేయాలని ట్రైనీ కలెక్టర్‌ సౌరభ్‌శర్మ సూచించారు. సోమవారం ఆయన మెప్మా కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. తొలుత ఎస్‌ఎల్‌ఎఫ్‌, ఎస్‌ఎస్‌జీ గ్రూప్స్‌ నిర్వహణపై సమీక్షించారు. బ్యాంకు రుణాల మంజూరు, చెల్లింపులపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంసీ చంద్రశేఖర్‌బాబు, టీఎంసీ బి.వెంకటేశ్వర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లుశాంతకుమార్‌, మౌలాలీ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

15 మంది ప్రయాణికులకు స్వల్పగాయాలు


ఘటనాస్థలంలో ఆర్టీసీ బస్సు, లారీ

వైరారూరల్‌: మండలంలోని స్టేజీ పినపాక హైలెవల్‌ వంతెనపై సోమవారం ఎదురెదురుగా ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొని 15 మంది గాయపడ్డారు. వివరాలు ఇలా.. మణుగూరు డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్‌ సర్వీసు సుమారు 30 మంది ప్రయాణికులతో మణుగూరు నుంచి ఖమ్మం వస్తోంది. అదే సమయంలో లారీ వైరా వైపు నుంచి తల్లాడ వైపు వెళ్తోంది. ఈ క్రమంలో స్టేజీ పినపాక హైలెవల్‌ వంతెనపై బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాద సమయంలో రెండు వాహనాలు అతివేగంగా ఉండడంతో బస్సు డ్రైవర్‌ విజయ్‌ సహా బస్సులో ఉన్న 15 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యా యి. ఏసీపీ ఎం.ఏ.రెహమాన్‌, సీఐ ఎన్‌.సాగర్‌, ఎస్సై పి.రామారావు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108లో ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులకు మూడు గంటల సమయం పట్టింది.

పోలీసుల అదుపులో అనుమానిత వ్యక్తి

భద్రాచలంఅర్బన్‌: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఆదివారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చికిత్స పొందుతున్న బాధితుల ద్వారా విషయం తెలుసుకున్న ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రామకృష్ణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారొచ్చి సదరు వ్యక్తిని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. కాగా ఆస్పత్రిలో చిన్నారులను ఎత్తుకెళ్తుండగా ఓ వ్యక్తిని పట్టుకున్నట్లు సోషల్‌ మీడియాలో ప్రచారం జరిగింది. అయితే అది అవాస్తవమని, అలాంటి వార్తలు నమ్మొద్దని సూపరింటెండెంట్‌ ఒక ప్రకటనలో తెలిపారు.

బంగారం చోరీ

అశ్వాపురం: మండల కేంద్రంలోని చిన్న తండాలో ఓ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు.. తండాకు చెందిన తేజావత్‌ విజయ ఆదివారం సాయంత్రం ఇంటి సమీపంలో వినాయకచవితి ఉత్సవాల వద్దకు వెళ్లింది. ఆ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు గడ్డపలుగుతో తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా తాళాలు పగులగొట్టి 11 గ్రాముల బంగారం, రూ.20వేల నగదు చోరీచేశారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు విచారణ చేపట్టారు.

సింగరేణి కార్మికుడికి పాముకాటు


కార్మికుడితో మాట్లాడుతున్న ఎస్‌ఓటూ జీఎం, ఏఐటీయూసీ నాయకులు

మణుగూరు టౌన్‌: సింగరేణి మణుగూరు ఏరియాలోని ఓసీ-2 డంపర్‌ షెడ్‌లో సోమవా రం మొదటి షిఫ్ట్‌లో విధులు నిర్వర్తిస్తున్న కమటం వెంకటేశ్వర్లుకు పాము కాటు వేసింది. దీంతో ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. కార్మికుడిని ఎస్‌ఓటూ జీఎం శ్రీనివాసచారి, ఏఐటీయూసీ నాయకులు మల్లెల రామనర్సయ్య, ఆదర్ల సురేందర్‌ తదితరులు పరామర్శించారు. కాగా అధికారులు ఇచ్చిన సమాచారంతో వచ్చిన స్నేక్‌ క్యాచర్‌ ముజాఫర్‌ పామును పట్టివేశాడు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు

ఇల్లెందు: ఇల్లెందు, పినపాక, భద్రాచలం ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. తమ నియోజకవర్గాల పరిధిలో ఇంకా అనేక మంది అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదని, గృహాల సంఖ్య పెంచాలని కోరారు. దీనికి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యేలు తెలిపారు.


ముఖ్యమంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యేలు

విద్యార్థుల ఆందోళన

జూలూరుపాడు: మధ్యాహ్న భోజనం సక్రమంగా పెట్టడంలేదని, మెనూ పాటించడంలేదని ఆరోపిస్తూ సోమవారం జూలూరుపాడు హైస్కూల్‌ విద్యార్థులు పాపకొల్లు రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కొద్ది రోజులుగా ఉడికీఉడకని అన్నం, నీళ్ల సాంబారు వడిస్తున్నారని ఆరోపించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

వాగులో మునిగి యువకుడి మృతి


భానుప్రకాశ్‌ (ఫైల్‌)

చర్ల: మండలంలోని రాళ్లగూడేనికి చెందిన ఓ యువకుడు వాగులో మునిగి మృతిచెందిన సంఘటన సోమవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బండి భానుప్రకాశ్‌ (33) గోదావరి నది వైపు చేపల వేటకు వెళ్లే క్రమంలో మార్గమధ్యలోని ఊటొర్రె దాటు తూవాగులో మునిగిపోయాడు. సమీపంలో పశువులు మేపుతున్నవారు గమనించి పోలీస్‌, రెవెన్యూ, ఎన్‌డీఆర్‌ఎఫ్‌ అధికారులకు సమాచారం అందించారు. చర్ల సీఐ ఏ.రాజువర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్‌, తహసీల్దార్‌ ఎం.శ్రీనివాస్‌, పంచాయతీ కార్యదర్శి రాంకుమార్‌, భద్రాచలం నుంచి ఎన్‌డీఆర్‌ఎఫ్‌ సిబ్బంది, గజ ఈతగాళ్లు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్లు వాగులో వెతకగా మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య మార్తమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అందరితో కలివిడిగా ఉండే భానుప్రకాశ్‌ మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

డెంగీతో బాలిక మృతి

గుండాల: నాలుగు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఓ బాలిక సోమవారం మృతి చెందింది. మండల కేంద్రానికి చెందిన ఇర్ప ప్రవలిక(15) హైదరాబాద్‌లో డిప్లొమా చదువుతోంది. నాలుగు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సఅందించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు డెంగీ జ్వరంగా గుర్తించారు. సోమవారం తెల్లవారు జామున పరిస్థితి విషమించి మృతి చెందింది.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


గుగులోత్‌ పీక్లా (ఫైల్‌)

టేకులపల్లి: చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం మృతి చెందాడు. టేకులపల్లి పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని తొమ్మిదోమైలుతండాకు చెందిన గుగులోతు పీక్లా (46) గత నెల 19న రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.